


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 157, పేజీలు - 08

ఆదివారం, నవంబర్ 16, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు.?

**- సీఎం రేవంత్ వ్యాఖ్యల నేపథ్యంలో ఉత్కంఠ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ఎప్పుడు నిర్వహించనున్నారనేది చర్చనీయాంశంగానే మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ (వెనుకబడిన తరగతుల)లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుంది. అయితే ఇందుకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించింది. అదే సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాకుండా, ఇదివరకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు తెలిపపింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జారీ చేసిన జీవోపై స్టే విధిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేసింది. అక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఇప్పుడు ఎన్నికలకు వెళితే ఇదివరకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారమే నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎలా

2లో..

## బీహార్ సీఎం పదవిపై బీజేపీ కొత్త ఫార్ములా

**- నితీశ్ సిద్ధమేనా.? కీలక మలుపు!**



పాట్నా (ప్రశ్న న్యూస్) బీహార్ లో ఎన్డీఏ భారీ విజయం సాధించింది. అంచనాలకు మించి సీట్లు గెలుచుకుంది. మరో సారి ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగనుంది. అయితే, ఈ సారి ముఖ్యమంత్రి ఎవరు. నితీశ్ కొనసాగుతారా, లేక బీజేపీ నుంచి కొత్త ముఖ్యమంత్రి వస్తారా అనేది ఉత్కంఠగా మారుతోంది. ఇదే సమయంలో కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. చిరాగ్ పాశ్వాన్ కు ప్రాధాన్యత పెరుగుతోంది. 2029 లోక్ సభ ఎన్నికలే లక్ష్యంగా ఇప్పుడు బీహార్

2లో..

## ఏపీకి దేశాన్ని నడిపించే సామర్థ్యం ఉంది

**- ఆంధ్రప్రదేశ్ క్వాంటం కంప్యూటింగ్ పాలసీ విడుదల చేసిన లోకేష్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** క్వాంటం టెక్నాలజీ రంగంలో దేశాన్ని ముందుండి నడిపించే సామర్థ్యం ఏపీకి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. క్వాంటం కంప్యూటింగ్ అంశంపై సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ ప్రాంగణంలో జరిగిన సదస్సులో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్వాంటం కంప్యూటింగ్ అంశంపై కీలక ప్రసంగం ఇవ్వడానికి నేను సరైన వ్యక్తిని కాదనిపిస్తోంది. ఈ రంగంపై నాకు చాలా పరిమితమైన అవగాహన మాత్రమే ఉంది. నేను ఇప్పటికీ నేర్చుకుంటున్నాను. ఇంత గొప్ప

2లో..

## ఏపీ పాలసీలు అద్భుతం

**- సీఎం చంద్రబాబును ప్రశంసించిన రేమాండ్స్ గ్రూప్**

- శ్రీసిటీకి అదనంగా 6 వేల ఎకరాల భూమి కేటాయింపు
- సీఐఐ సదస్సులో వెల్లువెత్తిన పెట్టుబడులు
- రాయలసీమలో రూ.1201 కోట్లతో రేమాండ్స్ గ్రూప్ మూడు ప్రాజెక్టులు
- శ్రీసిటీలో రూ.2320 కోట్ల విలువైన కొత్త ఒప్పందాలు



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి పథంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామిక టౌన్‌షిప్‌గా ఉన్న శ్రీసిటీకి అదనంగా 6 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నట్టు వెల్లడించారు. శ్రీసిటీని రాష్ట్ర అభివృద్ధికి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. సదస్సు రెండో రోజైన శనివారం సీఎం చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై తన దార్శనికతను ఆవిష్కరించారు. సీఐఐ సదస్సు నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు, రేమాండ్స్ గ్రూప్‌కు చెందిన 3 ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, శ్రీసిటీలో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన 5 కంపెనీలను లాంఛనంగా ప్రారంభించారు. శ్రీసిటీలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన పలు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "భారతదేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక టౌన్‌షిప్ శ్రీసిటీ. డైకెన్, ఇసుజు, క్యాడ్బరీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇక్కడి నుంచే తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నాయి. మరిన్ని

2లో..

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

**- లొంగిపోయిన కీలక నేత ఆజాద్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి మరో భారీ దెబ్బ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. నిషేధిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) %-% సిపిఐ(మా) పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న, డివిజన్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేష్‌తో పాటు వారి క్యాడర్ 20 మంది

2లో..

## హరీష్ రావు ద్రోహం వల్లే బీఆర్ఎస్ ఓటమి

**- కవిత సంచలన ఆరోపణలు**

- కృష్ణార్జునులు అంటారు.. ఒకరిపై ఒకరు బాణాలు వేసుకుంటారు
- హరీష్ రావు నైజం మోసం చేయడమేనన్న కవిత
- పార్టీలో ఉంటూనే హరీష్ ద్రోహం చేశారని ఆరోపణ
- కేటీఆర్ సోషల్ మీడియా వదిలి బయటకు రావాలని హితవు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లిహిల్స్ ఉపఎన్నిక తర్వాత బీఆర్ఎస్ పై తన ఎటాక్ ను మరింత ఉధృతం చేశారు కల్వకుంట్ల కవిత. మెదక్ లో మీడియాతో మాట్లాడుతూ హరీష్ రావును పూర్తి స్థాయిలో టార్గెట్ చేశారు. హరీష్ రావు కుటుంబం ప్రైవేట్‌గా పాల వ్యాపారం చేసి, పాల రైతులకు అన్యాయం చేసినట్టు ఆరోపించారు. టెండర్లు లేకుండానే హాస్టళ్లకు పాలు సప్లై చేసి డబ్బు సంపాదించుకున్నారని, ఇది రైతుల హక్కులను మోసం చేసినట్టు అన్నారు. హరీష్ రావు కుటుంబానికి చెందిన కంపెనీలు టెండర్ ప్రక్రియ లేకుండా హైదరాబాద్, మెదక్ ప్రాంతాల్లోని హాస్టళ్లకు, హాస్పిటల్స్‌కు పాలు సప్లై చేసి, రూ. 50-100 కోట్లు వ్యాపారం చేశారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ డైరీల కు పోటీగా, రైతుల నుంచి తక్కువ ధరలకు కొని ఎక్కువ ధరలకు అమ్మారని చెప్పారు. పాల రైతులు లీటర్‌కు రూ. 20-25 పొందుతున్నారు, కానీ హరీష్ కుటుంబం ఇంటర్మీడియరీల

2లో..

## ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్

2లో..

**కరేబియన్ దీవుల నుంచి వెబ్‌సైట్ నిర్వహణ**




## మాగంటి సునీత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

- **జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఇంటికి వెళ్లిన కేటీఆర్**
- **ఉప ఎన్నిక ఓటమి నేపథ్యంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన వైనం**
- **రాజకీయాల్లో గెలుపోటములు చాలా సాధారణమని వ్యాఖ్య**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి అధైర్యపడొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన మాగంటి సునీత గోపీనాథ్ నివాసానికి ఆయన

2లో..

## తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

**- అధికారిక పేజీపై బెట్టింగ్ లింక్ ప్రత్యక్షం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని హైదరాబాద్‌లో సంచలన ఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర న్యాయవ్యవస్థకు కీలకమైన తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురవడం తీవ్ర కలకలం రేపుతోంది. సాధారణంగా ఆర్డర్ కాపీలు, కేసు వివరాలు లేదా ఇతర అధికారిక పత్రాలు డౌన్‌లోడ్ చేసుకునేందుకు వినియోగదారులు సైట్‌లోకి లాగిన్ అవుతుంటారు. కానీ వారికి పీడీఎఫ్ ఫైల్‌ల బదులు

2లో..

## రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ

**జూబ్లీహిల్ కొత్త ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరు**

- సమావేశానికి హాజరైన భట్టి, మహేశ్ గౌడ్ - జూబ్లీహిల్స్ విజయం, రాష్ట్ర రాజకీయాలపై ప్రధానంగా చర్చ
- త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలపైనా చర్చ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ఢిల్లీలో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కీలక సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా

2లో..

## జహీరాబాద్‌లో పోలీసుల తనిఖీలు..

# తుపాకీ స్వాధీనం



పటాన్‌చెరు, : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. పట్టణంలోని భారత్ నగర్ కాలనీలో డీఎస్పీ సైదా నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. జహీరాబాద్, సంగారెడ్డి సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది హాజరై కాలనీవాసుల సమాచారాన్ని సేకరించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 32 బైకులు, 14 ఆటోలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ పట్టణ శివారులోని పరిశ్రమల్లో పని కోసం వచ్చే, గుర్తింపు కార్డు లేని వ్యక్తులకు అద్దెకు ఇవ్వకూడదని సూచించారు. మరోవైపు ఈ తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి ఎయిర్ గన్, దుప్పికొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వినయ్ కుమార్, కాశీనాథ్‌లు వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## వయోవృద్ధుల సంక్షేమ వారోత్సవ ర్యాలీ

దేవరకద్ర,: వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల సంక్షేమ వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ యాదయ్య మాట్లాడుతూ, వయోవృద్ధులు సమాజానికి ఆస్తి అని, వారి అనుభవం యువతకు మార్గనిర్దేశం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న చట్టాలు, పథకాలను ఖచ్చితంగా పాటిస్తూ, వారికి అవసరమైన సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ర్యాలీలో పలువురు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ వయోవృద్ధుల పట్ల గౌరవాన్ని పెంపొందించడానికి ఉపయోగపడిందని అధికారులు తెలిపారు.

## కల్వకుర్తిలో పురాతన బావికి పునరుజ్జీవం

కల్వకుర్తి, : కల్వకుర్తి పట్టణంలో పురాతన గచ్చుబావికి పూర్వ వైభవం తీసుకురావడానికి శనివారం బీజేపీ నేత తల్లోజు ఆచారి యువకులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కల్వకుర్తి హిందూ యువత బావి పునరుద్ధరణకు చేస్తున్న కృషిని అభినందించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

మక్తల్, : అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు అమర్చిన కరెంట్ తీగలు తగిలి ఓ రైతు మృతి చెందారు. ఈ సంఘటన పాన్ గల్ మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెంగలాయిపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ (53)అనే రైతు గ్రామ శివారులో ఉన్న తన పొలంలో వరి పంట సాగు చేశాడు. అడవి పందుల నుంచి ఆ పంటను రక్షించుకోవడానికి విద్యుత్ తీగలు అమర్చారు. పొలం వద్దకు వెళ్లిన అతను ఉదయం వరకు తిరిగి రాలేదు. విద్యుదాఘాతానికి గురైన పొలం వద్ద పడిపోయిన రైతును స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలను సేకరించారు.

## ప్రయాణికులకు విజ్ఞప్తి.. రైల్వే భవనం ఉండదు

నారాయణపేట, : మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారాలున్న పాత భవనం ఇక కనిపించదు. 32 ఏళ్ల పాటు సేవలందించిన దీన్ని రేపో మాపో నేలమట్టం చేయనున్నారు. ఇక్కడి వివిధ విభాగాలను తాత్కాలిక భవనాల్లోకి మార్చేస్తున్నారు. నిజాం గ్యారంటీడ్ రైల్వేలైన్ ఏర్పాటు సమయంలో కట్టిన పాత భవనం తొలగించి 1993లో బ్రాడ్‌గేజీ ఏర్పాటు సమయంలో ప్రస్తుత భవనాలు నిర్మించారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ కింద మహబూబ్‌నగర్ ఎంపిక చేశారు. పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రస్తుత భవనాన్ని కూల్చి ఇక్కడ కొత్తది నిర్మించనున్నారు. ఇక్కడున్న రైల్వే బుకింగ్ కౌంటర్, విచారణ కౌంటర్లను స్టేషన్‌కు కుడివైపు రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) పోలీసు ఠాణా వెనకాల ఉన్న తాత్కాలిక భవనంలోకి, రిజర్వేషన్ కౌంటర్‌ను రైల్వే మెయిల్ కార్యాలయ భవనంలో ఎస్‌బీఐ ఏటీఎం పక్కన ఏర్పాటు చేశారు.

## ఏటీఎం కార్డులు మార్చి.. బురిడీ కొట్టించి..

అచ్చంపేట, : ఏటీఎం కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే వారిని బురిడీ కొట్టించి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలు పోలీసులకు చిక్కారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రెండో పట్టణ ఠాణాలో డీఎస్పీ వెంకటేశ్వర్లు విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. హరియాణా రాష్ట్రం హిస్సార్ జిల్లాకు చెందిన సన్నీ, రాజేశ్ ఇద్దరు మిత్రులు. చెడు వ్యసనాలకు బానిసైన వారు డబ్బులు సులువుగా సంపాదించేందుకు దారులు వెతికారు. పనిచేయని ఏటీఎం కార్డులు సేకరించి.. ఆయా ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు తీసుకునేందుకు వచ్చిన వారితో మాట కలిపి కార్డులు మార్చి బురిడీ కొట్టించడం ప్రారంభించారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

## పొంచి ఉన్నప్రమాదం

తుంగతుర్తి, : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం సంగెం నుండి వెంకేపల్లి చిల్పకుంట్లకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం రైతులు తమ గొర్రెలు, బర్రెలను తిప్పుతుంటారు. విద్యుత్ అధికారులు ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో, అజాగ్రత్తగా ఉంటే ప్రజలకు, పశువులకు ప్రాణాపాయం వాటిల్లే ప్రమాదం ఉంది. వెంటనే విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టి ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వరి కోత యంత్రం ఆర్టీసీ బస్సు ఢీ

సూర్యాపేట, : శనివారం సూర్యాపేట సమీపంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై దురాజ్పల్లి వద్ద ఆర్టీసీ బస్సు వరి కోత యంత్రాన్ని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బస్సు ముందు భాగం తీవ్రంగా ధ్వంసమైంది. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుగుతోంది.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు..

## 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం

కోదాడ, : సూర్యాపేట దూరజ్‌పల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటన కారణంగా రహదారిపై సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## లోక్ అదాలకు సద్వినియోగం చేసుకున్న కక్షిదారులు

హుజూర్‌నగర్, : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో నేడు లోక్ అదాలత్ నిర్వహించబడింది. రాజీమార్గమే రాజ మార్గం అని, అందుకే లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటున్నామని కక్షిదారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్యం వికటించి 17 మంది చిన్నారులకు అస్వస్థత

భువనగిరి, : వైద్యం వికటించి 17 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రభుత్వాసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ వీరంతా ఆసుపత్రిలో చేరారు. సాయంత్రం చిన్న పిల్లల వార్డులో రోజూ లాగే పిల్లలకు వైద్యులు ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో అరగంట తర్వాత వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ప్రస్తుతం బాధితులకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఒక ఇంజక్షన్ బదులు మరొకటి ఇచ్చారని వైద్యులతో తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

# సన్నబోయిన అన్నదాత

ఆలేరు, : సన్న రకం వడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. యాసంగి సీజన్ ముగిసి ఐదు నెలలు కావొస్తుంది. ఇంత వరకు రైతుల ఖాతాల్లో బోనస్ జమ కాలేదు. వానాకాలం సీజన్ కొనుగోళ్లు కూడా ప్రారంభమై దాదాపు 20 రోజులు అవుతోంది. ప్రభుత్వం మాత్రం బోనస్‌పై పెదవి విప్పడం లేదు.

## విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్‌ను

## సంఘ భవనంలో ఇవ్వాలి



ఎల్లారెడ్డి, : ఎల్లారెడ్డి ఎస్టిఓ పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్ను ఎల్లారెడ్డి విశ్రాంత ఉద్యోగుల భవనంలో జనవరి 2026 చివరి వరకు అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆకుల కిష్టయ్య, కోశాధికారి నర్సింహారావులు తెలిపారు. నర్సింహారావు ఎల్లారెడ్డి పట్టణంలో సేవభావంతో విశ్రాంత ఉద్యోగి ఇంటికి వెళ్లి, లైఫ్ సర్టిఫికెట్ను మొబైల్ యాప్లో ఆన్లైన్ చేశారు. తాము విశ్రాంత ఉద్యోగుల ఇంటికి వెళ్లి సేవలు అందిస్తున్నామని, ఆన్లైన్ అయ్యాక ఆధార్, పాన్ కార్డు పెన్షనర్ ఆఫీసులో ఇవ్వాలని సూచించారు. లైఫ్ సర్టిఫికెట్ను పరిచయంలేని వ్యక్తులతో ఆన్లైన్ చేయించవద్దని కోరారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు



జుక్కల్, : బిచ్కుందలో లైన్స్ క్లబ్ ఆఫ్ బిచ్కుంద డైమండ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు శనివారం అందించారు. అధ్యక్షుడు డాక్టర్ రాజు మార్గదర్శకత్వంలో, ల్యాబ్ టెక్నీషియన్ గోపాల్ ప్రజలకు మధుమోహ (షుగర్) రక్త పరీక్షలు నిర్వహించారు. బోధన్ కంటి ఆసుపత్రి నుండి కంటి ఆపరేషన్లు చేయించుకొని వచ్చిన రోగులకు బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్ పర్సన్ డాక్టర్ ఓం ప్రకాష్, జోన్ చైర్ పర్సన్ మారుతీ పాల్గొన్నారు.

## పిట్లం లక్ష్మి హనుమాన్ మందిరంలో

# కార్తీక దీపోత్సవం

కామారెడ్డి, : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి హనుమాన్ మందిరంలో మంగళవారం, నవంబర్ 18 సాయంత్రం 6 గంటలకు కార్తీక దీపోత్సవం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొని దీపం వెలిగించుకున్న భక్తులకు పుణ్యఫలాలు లభిస్తాయని ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమం అనంతరం ప్రసాద పంపిణీ కూడా ఉంటుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను

## కలిసిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

బాన్సువాడ, : జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ సాధించిన అఖండ మెజారిటీ విజయాన్ని పురస్కరించుకుని, జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మరియు నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ హైదరాబాద్‌లోని పీసీసీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సంతలో దొంగల హల్ చల్.. 10 సెల్ ఫోన్లు చోరీ

రాజేంద్రనగర్, : బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షాకోట్‌లో సంతలో దొంగలు హల్ చల్ చేశారు. ఓ మహిళతో పాటు ఇద్దరు యువకులు సంతకు వచ్చిన వారి నుంచి పది సెల్‌ఫోన్లు, ఆరు పర్సులు దొంగిలించారు. బాధితులు గమనించి ముగ్గురిని పట్టుకోగా ఇద్దరు యువకులు తప్పించుకున్నారు. స్థానికులు మహిళను పట్టుకుని కొట్టగా, సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆమెను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

## అత్తాపూర్‌లో ఫ్లైఓవర్‌పై కారు బోల్తా..

## నలుగురికి తీవ్ర గాయాలు

మెహిదీపట్నం, : అత్తాపూర్‌లోని పీవీ నరసింహారావు ఫ్లైఓవర్‌పై శంషాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు మహిళలు, ఒక చిన్నారితో సహా నలుగురు గాయపడ్డారు. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కారును తొలగించే చర్యలు చేపట్టారు.

## విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

## అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్




వికారాబాద్, : వికారాబాద్ జిల్లా చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌ను త్వరలో డీమ్డ్ యూనివర్సిటీగా తీర్చిదిద్దనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య విద్యలో ప్రతిభ చాటిన పలువురికి బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## అనుమానాస్పద స్థితిలో పారిశుద్ధ్య కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్, : అనుమానాస్పద స్థితిలో ఓ పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన జీడిమెట్ల ఠాణా పరిధి చింతల్ హెచ్‌ఎంటీ మైదానంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌ఎంటీ అటవీప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికుడు అంజనేయులు(50) మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం కాలిన స్థితిలో ఉండటంతో.. సదరు వ్యక్తికి ఫిట్స్ సమస్య ఉండటంతో, చెత్తకు నిప్పుపెట్టే క్రమంలో మంటల్లో పడి కాలిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో మద్యం మత్తులో

# యువతి డ్రైవింగ్

గోల్కొండ, : నగరంలోని జూబ్లీహిల్స్‌లో అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. మద్యం మత్తులో యువతి కారు నడిపినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాద సమయంలో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. కారులోని డ్రైవింగ్ సీటులో ఇరుక్కుని ఉన్న ఆమెను అద్దాలు పగులగొట్టి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఫిల్మ్‌నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు.

## నందమూరి బాలకృష్ణకు ఘన స్వాగతం



హిందూపురం, : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మూడు రోజుల పర్యటన కోసం శనివారం తన నియోజకవర్గం హిందూపురానికి చేరుకున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో వస్తున్న బాలకృష్ణకు బాగేపల్లి టోల్గేట్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు.

## జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా నారాయణప్ప

అనంతపురం,: సత్యసాయి జిల్లా వైయస్సార్సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా అమరాపురం మండలానికి చెందిన వైకాపా నాయకుడు నారాయణప్పను అధిష్టానం నియమించింది. ఈ నియామకంపై నారాయణప్ప మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ కి, మడకశిర నాయకులు ఈర లక్కప్ప మరియు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం శనివారం జరిగింది.

## కదిరిలో ఐక్యత మార్చ్:

## దేశభక్తి చాటిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి, : కదిరిలో 'ఐక్యత మార్చ్ ఏక్ భారత్ ఆత్మనిర్భర్ భారత్' పేరుతో సాంస్కృతిక పాదయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, దేశం కోసం ప్రతి పౌరుడు సైనికుడిలా సేవ చేసి, ప్రాణాలను సైతం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. జాతీయ ఐక్యతలో సర్దార్ పటేల్ పాత్రను గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ 5 కిలోమీటర్ల పాదయాత్రలో శ్రీనివాసులు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెరగాలని ఆయన ఆకాంక్షించారు.

# ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర రోడ్డు ప్రమాదం



భోపాల్: మధ్యప్రదేశ్ రాష్ట్రం రత్లాం సమీపంలోని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే పై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో దూసుకెళు న్న కారు నియంత్రణ కోల్పోయి బ్రిడ్జి పైనుంచి కిందికి పడిపోయింది. ఈ భయానక ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారుల సమాచారం. ఢిల్లీ నుంచి గుజరాత్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఓవర్‌స్పీడ్ కారణంగా కారు రహదారి మధ్యలో ఉన్న గుంతను ఢీకొని అదుపుతప్పి లోయలో బలంగా పడినట్లు ప్రాథమిక సమాచారం. ఢీకొన్న ప్రభావం కారణంగా వాహనం పూర్తిగా దెబ్బతిన్నది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను బయటకు తీసి సమీప ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అంతేగాక, ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కారు అదుపుతప్పిన విధానం, పడిపోయిన తీరు భయానకంగా ఉండటంతో వీడియోలు విస్తృతంగా వైరల్‌గా అయ్యాయి. కారు నెంబర్ %వీనూ3 జూ% 1388 గా పోలీసులు గుర్తించారు. బాధితులు అహ్మదాబాద్, ముంబై నివాసితులుగా పోలీసులు గుర్తించారు. వారిలో గులాం రసూల్ (70), ఖలీస్ చౌదరి, అబ్దుల్ గులాం చౌదరి, డానిష్ చౌదరి (15), దుర్గేష్ ప్రసాద్ (35) గా గుర్తించారు. ధ్వంసమైన కారు నుంచి మృతదేహాలను వెలికితీయడంలో స్థానికులు పోలీసులకు సహాయం చేశారు. మృతదేహాలను రత్లాంలోని డాక్టర్ లక్ష్మీ నారాయణ్ పాండే ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుమార్టం నిర్వహించారు.

# బిహార్ ఫలితాన్ని గౌరవిస్తున్నాం.. మా పోరాటం ఆగదు

న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల్లో విపక్ష కూటమి ఘోరపరాజయంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఫలితాన్ని స్వీకరించిన ఆయన.. ప్రజాస్వామ్యం కోసం తమ పోరాటం మాత్రం కొనసాగుతూనే ఉంటుందన్నారు. 'బిహార్ ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం. అయితే రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే శక్తులపై మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఈ ఫలితాన్ని లోతుగా పరిశీలించి, ఇలా ఎందుకు జరిగిందో తెలియజేస్తాం. మా కూటమికి ఓటేసిన ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. కాంగ్రెస్ కార్యకర్తలు డీలా పడాల్సిన అవసరం లేదు. మీరే మా గౌరవం, విజయం. మీ కష్టమే మా బలం. ప్రజలకు అవగాహన కల్పించడంలో ఏమాత్రం వెనక్కు తగ్గం. ప్రజల మధ్యనే ఉంటూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటాన్ని కొనసాగిస్తాం. ఇది సుదీర్ఘ పోరాటం.. పూర్తి పట్టుదల, ధైర్యం. నిజాయితీతో పోరాడతాం' అని ఖర్గే పేర్కొన్నారు.

# కాంగ్రెస్ వల్ల నష్టపోయాం..

## లేకుంటే బీహార్‌లో 15 సీట్లు గెలిచేవాళ్ళం

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ ఊహించిందే జరిగింది. సర్వేలు అలాగే ఎగ్జిట్ ఫలితాలు కంటే ఎక్కువగానే ఎన్డీఏ కూటమి సీట్లను సాధించింది. 243 అసెంబ్లీ స్థానాలకు గాను 200 పైగా దక్కించుకొని చరిత్ర సృష్టించింది ఎన్డీఏ. అయితే ప్రతిసారి తెలంగాణ రాష్ట్రంలో ఏడు సీట్లు సాధించే ఎంఐఎం పార్టీ బీహార్ లో తన జోరు కొనసాగించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా ఐదు స్థానాలు దక్కించుకుంది ఎంఐఎం పార్టీ. జోకిహాట్, బహదుర్గంజ్, కొచ్చధామన్ , అమౌర్, బైసి స్థానాల్లో అసదుద్దీన్ ఓవైసీ పార్టీ విజయం సాధించింది. అభ్యర్థులందరికీ 20 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీకి నాలుగు స్థానాలు దక్కగా ఈ సారి 29 స్థానాల్లో పోటీ చేసిన ఎంఐఎం పార్టీ ఐదు స్థానాలు దక్కించుకుంది. అయితే ఈ విజయంపై తాజాగా అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కారణంగా తాము నష్టపోయామని వెల్లడించారు. ముస్లిం ఓట్లను కాంగ్రెస్ పార్టీ చీల్చిందని పేర్కొన్నారు. లేకపోతే బీహార్ లో 15 సీట్లు సాధించే వాళ్ళమని ధీమా వ్యక్తం చేశారు ఓవైసీ.

# ఎన్నికలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులను గెలిపించండి

అనంతపురం,: రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులను సభ్యులుగా గెలిపించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. అనంతపురంలో శనివారం ఆయన మాట్లాడుతూ, బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలలో రిజర్వేషన్లు అమలు చేయాలని, అలాగే హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు.

# మద్యం దుకాణానికి మహిళల తీవ్ర వ్యతిరేకత:

## పుత్తూరులో ఆందోళన

పుత్తూరు, : పుత్తూరు పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేయాలనుకున్న గౌడ వైన్స్ మద్యం దుకాణాన్ని స్థానిక మహిళలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమ కాలనీ పరిసరాల్లో మద్యం దుకాణం తెరవడం వల్ల కుటుంబాల పతనం, యువత భవిష్యత్తు చీకట్లోకి నెట్టబడే ప్రమాదం ఉందని పేర్కొంటూ రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో చేరి 'మా కాలనీలో మద్యం దుకాణం వద్దు, పిల్లల భవిష్యత్తు చెడగొట్టే దుకాణాలు వద్దు' అంటూ నినాదాలు చేశారు. స్థానిక పురుషులు, యువకులు కూడా మహిళలకు మద్దతుగా నిలిచారు. ఆందోళన సమాచారం అందుకున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు అక్కడికి చేరుకుని మహిళలకు ప్రశాంతంగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

# కలెక్టర్ ను కలిసిన యుగంధర్ పొన్న



గంగాధర నెల్లూరు, : చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ను శనివారం జీడి నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ యుగంధర్ పొన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యుగంధర్ పొన్న మాట్లాడుతూ, కార్వేటినగరం మండలం, ఎల్ ఆర్ పేట పంచాయతీ ఎస్టీ మరియు బీసీ కాలనీవాసుల కు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కాలనీ ఏర్పాటు నుంచి రోడ్డు లేక స్థానిక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.

# మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన**

**మూడు పిటా కేసుల్లో నలుగురు బాధితులను రక్షించి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్**

**మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 82 మందిపై పెట్టి కేసులు నమోదు**

**ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్స్, సిడిఈడబ్ల్యూ సెంటర్స్ ద్వారా 28 కుటుంబాలను కలపడానికి కృషి**

**యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, షీ టీమ్స్ సైబరాబాద్ పరిధిలో**

**వివిధ ప్రాంతాల్లో 304 మంది అధికారుల అవగాహన**

**మహిళల హెల్ప్‌లైన్ కోసం 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, క్రైమ్స్ 1930 నంబర్ల గురుంచి వివరించిన అధికారులు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ కె.సృజన అన్నారు. సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఈ నెల 8 నుంచి 14వ తేది వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు, 22 మంది సెక్స్ వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. 3 పిటా కేసుల్లో నలుగురు బాధితులను రక్షించి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ కె. సృజన తెలిపారు. సైబరాబాద్ షీ టీమ్స్ నిర్వహించిన 140 ఢీకాయ్ ఆపరేషన్లలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 87 మందిని అదుపులోకి తీసుకొని 82 మందిపై పెట్టి కేసులు నమోదు చేసి మిగతా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతోపాటు మహిళా బాధితుల నుంచి వివిధ మార్గాల ద్వారా వచ్చిన 14 ఫిర్యాదులను షీ టీమ్స్ స్వీకరించారు. అనంతరం ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్స్ / సిడిఈడబ్ల్యూ సెంటర్స్ ద్వారా భార్యాభర్తల మధ్య కుటుంబ వివాదాల్లో 28 కుటుంబాలను మళ్లీ కలపడానికి కృషి చేశారు. యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీమ్స్ సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో 304 మంది అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మానవ అక్రమ రవాణా (హ్యూమన్, చైల్డ్ ట్రాఫికింగ్), ఈవ్ టీజింగ్, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మికత్వం, స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్, సైబర్ మోసాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళల హెల్ప్‌లైన్ కోసం 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, క్రైమ్స్ 1930 నంబర్ల గురుంచి వివరించారు.

# ధర్పల్లి పోలీసు వారి ఆధ్వర్యంలో చాచా నెహ్రూ జన్మదిన ట్రాఫిక్ అవగాహన ర్యాలీ





ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో బాలల దినోత్సవం సందర్భంగా దర్పల్లి పోలీసు వారి ఆధ్వర్యంలో స్కూల్ పిల్లల చేత ట్రాఫిక్ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రోడ్డు భద్రతా నియమాలు వివరించారు. నియమాలు పాటించిన వారికి పిల్లల చేత గులాబీ పువ్వు ఇప్పించి హెల్మెట్ ధరించని వారికి రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారికి పిల్లల చేత నియమాలు ఉన్న స్టికర్స్ ను ఇచ్చి ఈ నియమాలు పాటించాలని పిల్లలు వివరించారు. ఇట్టి కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం రోడ్డు పైన హెల్మెట్ లేకుండా ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనాలు నడిపే వారికంటూ వాళ్ల ఇంట్లో, వారి కుటుంబం ఉంటారు నీ పైన ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నారు, వారు జాగ్రత్తగా ఇంటికి చేరుకోవాలని ఇంట్లో ఎదురుచూస్తూ ఉంటారని,ఈ పిల్లలను చూసి అయినా వారి పిల్లలు గుర్తొచ్చి వారి కోసమైనా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదానికి గురై వారి కుటుంబం రోడ్డు పాలు కాకుండా జాగ్రత్త పడాలని యస్ ఐ కళ్యాణి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడం లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎస్సై కళ్యాణి అన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ హార్ట్ పబ్లిక్ స్కూలు పిల్లలు , కరస్పాండెంట్ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యాపీఠంను వేదపాఠశాలనకు అనుసందానం: యాదగిరిగుట్ట ఈవో





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగంగా టెంపుల్ సిటీ నందు వేదపాఠశాల నిర్మించబడుచున్నది. ఈ దేవస్థాన సంస్కృత విద్యాపీఠంను కూడా వేదపాఠశాలనకు అనుసందానం చేసి సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వంనకు నివేదించబడును. కార్యనిర్వహణాధికారి ఆదేశముల ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారి, ఇతర అధికారులు శనివారం పరిశీలన చేసియునారు. దేవస్థాన సంస్కృత విద్యాపీఠం ఎంతో ప్రాధాన్యం కలిగినది. వేదాధ్యయనం, సంస్కృత విద్యాభివృద్ధి యాదగిరిగుట్ట దేవస్థానం ధ్యేయాలలో ఒకటి. కావున సంస్కృత విద్యాపీఠం వేదపాఠశాలను ఒకే చోట ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసే క్రమంగా చర్యలు గైకొవలెనని ప్రభుత్వంనకు నివేదించబడును. ఇటీవలనే కార్యనిర్వహణాధికారి డిప్యూటీ ఈవో, ఇంజినీర్లు సంబందిత అధికారులతో దేవస్థాన సంస్కృత విద్యాపీఠంను పరిశీలించి గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు గైకొనబడినవి. అందులో భాగంగా – ఉపయోగించలేకపోయిన టాయిలెట్లు పునరుద్ధరణ, మరమ్మత్తులు అవసరమైన ప్రాంతాల్లో తక్షణ మరమ్మత్తులు, అదనపు ఫ్యాన్ల ఏర్పాటు, శుభ్రత, హైజీన్ పై ప్రత్యేక దృష్టి, సేఫ్టీ సంబంధిత లోపాల పరిష్కారం వంటి చర్యలు చేపట్టబడ్డాయి. మరిన్ని అవసరమైన సవరణలు, శాశ్వత మార్పులు, విద్యార్థుల సౌకర్యాల కోసం ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు ఇవ్వబడినవి. దేవస్థానం ఎల్లప్పుడూ సంస్కృత పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థుల శ్రేయస్సు కోసం కావాల్సిన సదుపాయాలు, భవనాలు, అధ్యయన సామగ్రి, వసతులు అందించడంలో గరుడా ట్రస్ట్ ద్వారా కూడా పూర్తి స్థాయిలో సహాయం అందిస్తామన్నారు.

# ఎన్నికల్లో సత్తా చాటిన జానపద గాయని

పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి మ్యాజిక్ ఫిగర్ ను దాటింది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల వరకు వెల్లడైన ఫలితాల్లో ఎన్డీయే కూటమి 126 స్థానాల్లో విజయం సాధించగా.. మరో 77 స్థానాల్లో లీడింగ్ లో కొనసాగుతోంది. ప్రతిపక్షమైన మహాగట్ బంధన్ 24 స్థానాల్లో గెలవగా.. 9 స్థానాల్లో లీడింగ్ లో ఉంది. ఈసారి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున అలీనగర్ స్థానం నుంచి పోటీ చేసిన పాతికేళ్ల జానపద సింగర్ మైథిలి ఠాకూర్ ఘన విజయం సాధించింది.

సమీప ఆర్జేడీ అభ్యర్థి 63 ఏళ్ల బినోద్ మిశ్రాపై 12 వేల పైచిలుకు మెజార్టీతో మైథిలి విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించిన మైథిలి.. బిహార్ లోనే యంగెస్ట్ ఎమ్మెల్యేగా నిలించింది. అంతేకాదు ఇప్పుడు దేశంలోనే అతిపిన్న వయసులో ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డును తన సొంతం చేసుకుంది. గతంలో ఈ రికార్డు మైనంపల్లి రోహిత్ పేరుపై ఉంది. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన మెదక్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. అప్పటికి మైనంపల్లి రోహిత్ వయసు 26 సంవత్సరాలు. అలీనగర్ నియోజకవర్గం నుంచి ప్రచారం చేస్తున్న సమయంలో.. తనను ఎన్నికల్లో గెలిపిస్తే.. అలీనగర్ పేరును సీతానగర్ గా మారుస్తానని హామీ ఇచ్చారు.

# సుపరిపాలన, అభివృద్ధి గెలిచింది

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి భారీ మెజార్టీ రావడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. బిహార్ ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని ట్వీట్ లో పేర్కొన్నారు. సుపరిపాలన, అభివృద్ధి, ప్రజానుకూల స్ఫూర్తి, సామాజిక న్యాయం గెలిచాయన్నారు. 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు చారిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ తీర్పు ప్రజలకు మరింత సేవ చేయడానికి, బిహార్ ను మరింత అభివృద్ధి చేయడానికి కొత్త బలాన్నిస్తుందని ట్వీట్ లో పేర్కొన్నారు.

రాబోయే కాలంలో బిహార్ పురోగతి, మౌలిక సదుపాయాలు అందించేందుకు, అక్కడి సంస్కృతిని కాపాడేందుకు మరింత కృషి చేస్తామన్నారు. రాష్ట్ర యువశక్తి, నారీశక్తికి జీవితం సమృద్ధిగా గడిపేందుకు కావలసిన అవకాశాలను సృష్టిస్తామన్నారు. ఎన్టీయే ట్రాక్ రికార్డ్, రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలన్న దార్శనికత ఆధారంగా ప్రజలు తమకు ఓటు వేశారని ప్రధాని తెలిపారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన సీఎం నితీష్ కుమార్, ఎన్డీయే కూటమి సభ్యులు చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీలను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

# యాదగిరిగుట్టలో నందీశ్వర అభిషేకం



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అనుబంధ ఆలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం నాడు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని లోక కళ్యాణం కొరకు ప్రదోషకాల సమయంలో పంచామృతాలతో విశేషంగా నందీశ్వర అభిషేకం వైభవంగా నిర్వహించడమైనది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజీతోనే త్వరితగతిన న్యాయం సాధ్యం

**- సీనియర్ సివిల్ జడ్జి : డి. నాగేశ్వర్ రావు**



మెట్‌పల్లి (ప్రశ్న న్యూస్) దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కోర్టులో కొట్లాడడం కన్నా పరస్పరం రాజీకి రావడం ద్వారానే త్వరితగతిన న్యాయం సాధ్యమవుతుందని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టుల్లో కేసులు సంవత్సరాల తరబడి కొనసాగకుండా రాజీ పద్ధతిని అవలంబించడం ప్రజలకే మేలుకలిగించే మార్గమని పేర్కొన్నారు. కక్షిదారుల్లో రాజీపై ఏర్పడుతున్న అవగాహన పెరగడం సానుకూల అభివృద్ధి అని అభినందించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 99 కేసులను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, సీఐ అనిల్ కుమార్, ఎస్సైలు కిరణ్ కుమార్, అనిల్ కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య.స్వాతంత్ర సమరయోధుడు గిరిజనుల ముద్దుబిడ్డ బిర్సా ముండ 150 వ జయంతి శుభ సందర్భంగా ఈరోజు తిరుపతిలో గిరిజన భవన్ లో 150వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరపడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా గిరిజన అధికారి బి రాజు సోము మరియు డిసి నెంబర్షనంగా జయప్రదం చేయడం జరిగింది సరస్వతమ్మ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆవుల మడుగు కళావతి గిరిజన అధికారులు మరియు గిరిజన నాయకులు పాల్గొని ఘనంగా జయప్రదం చేయడం జరిగింది.

## శ్రీ చైతన్య పాఠశాలలో నాసా విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో 6 వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు గల అన్ని ఓరియంటేషన్ విద్యార్థులకు నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ నాసా సంస్థ వారు నిర్వహించిన పరీక్షలో 21 మంది విద్యార్థులుఎంపిక అవ్వడం జరిగింది. ఈ విద్యార్థులందరికీ నాసా వారి తరపున పాఠశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా కిట్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ :నాసా వంటి ప్రపంచస్థాయి సంస్థల నుంచి గుర్తింపు పొందేలా గొప్పగా ఎంపిక అయిన విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేయాలని, అవి వారి ప్రతిభకు నిదర్శనంగా ఎంపిక కావాలని ఆశిస్తున్నామని తెలిపారు. నాసా సంస్థ వారు విద్యార్థులకు కేటాయించినటువంటి కిట్లను వారికి అందించడం నాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఎ.జి.ఎం సురేష్ మాట్లాడుతూ ఈ గుర్తింపు మరందరో విద్యార్థులకు ప్రేరణగా నిలిచి గొప్ప లక్ష్యాల వైపు నడిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ త్రివేణి,ఎస్ బ్యాచ్ ఇన్చార్జ్ శ్రీహరి నాసా ఇంచార్జ్ కవిత పాల్గొన్నారు.

## వరల్డ్ ఆక్వాకల్చర్ 2025 ప్రదర్శన

**హాజరైన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి**

**టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నోవాటెల్ ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో వరల్డ్ ఆక్వాకల్చర్ 2025 ఇండియా పేరిట ఏర్పాటు చేసిన వివిధ దేశాల స్టాళ్లను సందర్శించిన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ ప్రపంచ వ్యాప్తంగా ఆక్వాకల్చర్ యొక్క దాదాపు అన్ని అంశాలపై సాంకేతిక సెషన్‌లు వర్క్‌షాప్‌లను ఆక్వాకల్చర్ యొక్క సాంకేతిక ఆచరణాత్మక అంశాలపై తాజా పరిశోధనలను ప్రదర్శించడానికి అంతర్జాతీయ నిపుణులచే మత్యకార రైతులకు ఉపయోగపడే విధముగా ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు తెలంగాణ గంగపుత్ర సంఘం తరపున అభినందనలు తెలిపారు

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఓటమికి 5 కారణాలు

**- ఉపఎన్నిక ఫలితం బీఆర్ఎస్‌కు మరో చేదు అనుభవం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పే ఉపఎన్నికగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాన్ని అందరూ భావించారు. రెండేళ్ల కాంగ్రెస్ సర్కార్ పాలనపై ఓ పరీక్షగా ఈ ఉపఎన్నికను భావిస్తే, రాజకీయంగా కోల్పోయిన ప్రాభవాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్‌కు మంచి అవకాశంగా మరో పరీక్షగా విశ్లేషణలు జరిగాయి. కానీ, జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ఫలితం మాత్రం బీఆర్ఎస్‌కు మరో చేదు అనుభవాన్ని మిగిల్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన రెండో ఉపఎన్నికలో కూడా తన సిట్టింగ్ స్థానాన్ని గులాబీ పార్టీ కోల్పోయింది. అయితే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఐదు ప్రధాన కారణాలు ప్రముఖంగా చెప్పవచ్చు. ఈ కథనం పూర్తిగా చదివితే ఆ ఐదు కారణాలేంటో స్పష్టంగా అర్థమవుతాయి.

### 1. అధికార పార్టీ పాలనకు రెఫరెండం

ఈ ఉపఎన్నిక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన రెండో ఉపఎన్నిక. 2024 లో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణంతో వచ్చిన ఉపఎన్నికలో ఆమె సోదరి నివేదిత బరిలో నిలిచింది. అయితే అప్పటికే అధికారంలోకి వచ్చిన ఊపులో హస్తం పార్టీ కంటోన్మెంట్ స్థానాన్ని హస్తగతం చేసింది. ఆ తర్వాత జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఆయన సతీమణి మాగంటి సునీత కారు పార్టీ అభ్యర్థిగా ఉపఎన్నికలో పోటీ చేసింది. అయితే రిజల్ట్ సేమ్. కంటోన్మెంట్ ఉపఎన్నిక ఫలితమే జూబ్లీ హిల్స్‌లో పునరావృతమైంది. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత వచ్చిన ఉపఎన్నిక ఇది. కాంగ్రెస్ పాలనకు ఇది ప్రజాతీర్పు లాంటిది. ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అది ఈ ఉపఎన్నిక ద్వారా బయటపడుతుందని బీఆర్ఎస్ నేతలు భావించారు. 'ఆరు గ్యారంటీలు' అమలు కావడం లేదని ఇది జూబ్లీహిల్స్ ఓటరు తీర్పు ద్వారా బహిర్గతం అవుతుందని భావించారు. కానీ, కాంగ్రెస్ పార్టీపై జూబ్లీ ఓటర్లు సానుకూలంగా ఉన్నట్లు ఈ ఫలితం తేల్చి చెప్పింది. అభివృద్ధి, సంక్షేమం, 'ఆరు గ్యారంటీలు' అమలు చేసే పాలన తీరుకు ఓటర్లు సానుకూలంగా తీర్పు ఇచ్చినట్లు అర్థమవుతోంది. తాము ఏం చేస్తున్నారో సీఎం రేవంత్ రెడ్డితోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ క్యాడర్ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సఫలం అయ్యారు. దానికి నిదర్శనమే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. అయితే ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైంది.

### 2. ఎంఐఎం మద్దతుతో మైనారిటీ ఓట్ల ఏకీకరణ

జూబ్లీహిల్స్‌లో మైనారిటీ ఓటర్లు విజయాన్ని ప్రభావితం చేసే కీలక అంశం. ఈ నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లు సుమారు 1.4 లక్షలు ఉన్నాయి. అయితే ఈ ఓట్లను తమ వైపు తిప్పుకోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. పాత మిత్రపక్షం అయిన ఎం.ఐ.ఎం. కాంగ్రెస్‌తో జట్టు కట్టడంతో బీఆర్ఎస్‌కు గతంలో పడిన మైనారిటీ ఓట్లకు గండిపడింది. ఎం.ఐ.ఎం. ఈ ఉపఎన్నికలో పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించింది. అదే రీతిలో మైనారిటీ ఓట్లను ఆకట్టుకునేందుకు మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవిని హస్తం పార్టీ కట్టబెట్టింది. దీంతో మైనారిటీ ఓట్లను కాంగ్రెస్ దక్కించుకోవడంలో సక్సెస్ అయింది. దీంతో గులాబీ పార్టీకి మైనారిటీ వర్గం ఈ ఎన్నికలో మొండి చేయి చూపడంతో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడానికి ముఖ్య కారణంగా మారింది.

### 3. పనిచేయని మాగంటి 'సానుభూతి' అస్త్రం, కుటుంబ వివాదాలు

మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను బీఆర్ఎస్ తన అభ్యర్థిగా నిలబెట్టింది. సానుభూతి ఓట్లు పడి సులభంగా గెలుస్తుందన్నది బీఆర్ఎస్ పార్టీ వ్యూహం. కానీ, ఇది బెడిసికొట్టింది. మాగంటి గోపీనాథ్ సేవలు, సునీతపై సానుభూతి అంశాన్ని జూబ్లీహిల్స్ ఓటర్లు పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో పాటు ఎన్నికల సమయంలోనే మాగంటి సునీత కుటుంబ గొడవలు రచ్చకు దారి తీశాయి. మాగంటి గోపీనాథ్ మొదటి భార్య,, తల్లి జోక్యం చేసుకోవడం వల్ల అప్పటి వరకు ఎంతో కొంత ఉన్న సానుభూతి ఓటు కూడా చీలిపోయింది. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీకి 'ప్లాన్ బి' లేకుండా పోయింది. దీంతో అనుకున్న రీతిలో సానుభూతి ఓట్లను బీఆర్ఎస్ దక్కించుకోవడంలో పూర్తిగా విఫలమైంది.

### 4. ప్రచారంలో కానరాని అగ్రనాయకత్వం

ఓ వైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి కాలికి బలం కట్టుకొని ప్రచారం చేస్తుంటే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉన్నారు. అంతేకాకుండా, సీఎం హోదాలో ఇంతగా ప్రచారం చేయాలా అంటూ ఆ పార్టీ ముఖ్య నేతలు ఎద్దేవా చేశారు. తమ విజయం నల్లేరుపై నడకే అన్నట్లుగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఉదాసీనంగా వ్యవహరించారు. తన పాలనపై తానే స్వయంగా ప్రజలను ఒప్పించడానికి సీఎం రేవంత్ ప్రయత్నిస్తుంటే, దానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నుంచి సరైన రీతిలో కౌంటర్ అటాక్ చేయడంలో విఫలమైంది. ఇక పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీశ్ రావు కీలకమైన సమయంలో తండ్రి మరణంతో ప్రచారంలో పూర్తిగా నిమగ్నం కాలేకపోయారు. దీంతో కేటీఆర్ ఒక్కడిపైనే అధిక భారం పడింది. మరోవైపు కాంగ్రెస్ మంత్రులు, ముఖ్య నేతలు డివిజన్ల వారీగా ప్రచారంలోనూ, కాంగ్రెస్ వ్యూహాల అమలులో కీలకంగా వ్యవహరిస్తే, అదే స్థాయిలో బీఆర్ఎస్ నేతల భాగస్వామ్యం కొరవడింది. ఈ అంశం కూడా బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణంగా మారింది.

### 5. బీఆర్ఎస్ సెటిలర్ ఓటర్లకు గండి కొట్టిన కాంగ్రెస్

జీహెచ్ఎంసీ పరిధిలో గులాబీ పార్టీ వికసించడానికి కీలకమైన 'సెటిలర్ల' ఓట్లను ఈ దఫా హస్తం పార్టీ హస్తగతం చేసుకుంది. నియోజకవర్గంలోని కమ్మ సామాజిక వర్గం ఓట్లు, ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన 'సెటిలర్ల' ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయితే బీఆర్ఎస్‌కు పడకుండా కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పోల్ మేనేజ్‌మెంట్ చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆయా వర్గాల వారితో సమావేశాలు నిర్వహించడం వంటివి ఫలితానిచ్చాయి.

మరోవైపు 'సెటిలర్లు' కూడా అధికారంలో ఉన్న పార్టీతోనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ధోరణి కూడా బీఆర్ఎస్ పార్టీకి చేటు చేసింది.

ఈ అంశంపై బీఆర్ఎస్ కీలక నేతలు దృష్టి సారించకపోవడం కూడా ఆ పార్టీ ఓటమికి ప్రధాన కారణంగా మారింది.ఈ కారణాలన్నీ మిళితమై చివరకు సిట్టింగ్ స్థానాన్ని బీఆర్ఎస్ కోల్పోవడానికి దారి తీసింది. అయితే ఈ ఉపఎన్నిక ఫలితం తర్వాత 'కారు' జోరు పెంచడానికి పార్టీ అధినేత కేసీఆర్ ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## బీసీ సాధికారిత సంఘం సభ్యత్వ నమోదు డిసెంబర్ 12 నుంచి ప్రారంభం

- మొదటి విడతలో లక్ష సభ్యత్వాలు నమోదు లక్ష్యం
- బీసీ సంఘం రాష్ట గౌరవాధ్యక్షులు: కొండ దేవయ్య పటేల్
- బీసీ సంఘం ఉమ్మడి జిల్లాధ్యక్షులు : పొలాస నరేందర్



వేములవాడ (ప్రశ్న న్యూస్) బీసీ సాధికారిత సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేస్తూ, బీసీల ఐక్యత, హక్కుల సాధన, రాజకీయఆర్థికసామాజిక అభివృద్ధి సాధన దిశగా డిసెంబర్ 12 నుండి రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ ప్రకటించారు. సభ్యత్వ కార్యక్రమాన్ని వేములవాడ పుణ్యక్షేత్రం నుంచే ప్రారంభించనున్నట్టు తెలిపారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రావాల్సిన రాజకీయ కోటా, బడ్జెట్ వాటా, విద్య - ఉపాధి-ఉద్యోగాల్లో న్యాయం పొందేందుకు సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యంగా కదలాలనీ, బీసీ హక్కుల కోసం సాగుతున్న పోరాటాల్లో సభ్యులు, నాయకులు చురుకుగా పాల్గొనాలని కోరారు.బీసీ ఓట్లతో గెలిచిన నేతలు బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లు అమలు చేయకపోతే, వారిని ప్రశ్నించడంతో పాటు అవసరమైతే రాజీనామాలు డిమాండ్ చేసే స్థాయికి బీసీ సమాజం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లులను పార్లమెంటులో చర్చకు ప్రవేశపెట్టాలని, బిల్లులపై ఎవరు మద్దతు ఇస్తారో, ఎవరు వ్యతిరేకిస్తారో దేశానికి స్పష్టమవుతుందని అన్నారు.డిసెంబర్ 12 నుండి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కోసం అవసరమైన పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని కొండ దేవయ్య, పొలాస నరేందర్ వెల్లడించారు.

## బండ్లగూడ లో అక్రమ వెంచర్ ప్రభుత్వ ఖజానాకు బారీ గండి

**పదెకరాలలో రాళ్ళు పాతి ప్లాట్ లకు బేరం**

**చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్) బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ వెంచర్ చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవటం పై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ ప్రభుత్వ నిబంధనలు అడ్డంగా పాతేస్తూ అక్రమ వెంచర్ వెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవటం, కమీషనర్ సైతం ఈ విషయం తన పరిధి కాదన్నట్లు వ్యవహరించటం చూస్తుంటే అంతా కూడబలుక్కుని వ్యవహారం నడిపిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి. బండ్లగూడ జాగీర్ లోని సికిందర్ గూడ విలేజ్ లో పదెకరాలలో ఇల్లీగల్ లే అవుట్ వేసి అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నా అక్రమ వెంచర్ పై చర్యలు తీసుకుని ప్రజలను అవెర్ నెస్ చేయాల్సిన అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనక కోట్ల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు వున్నాయి. అధికారులు ప్రజలకు జవాబుదారి తనంగా వ్యవహరించాల్సింది పోయి వెంచర్ నిర్వాహకులకు సహాయ సహకారాలందిస్తున్నారని తెలుస్తుంది. ప్రభుత్వం దశాబ్దాలు గా స్లమ్ లు గా మగ్గిపోతున్న బస్తీలను గుర్తించి అక్కడ అధునాతన సౌకర్యాలతో టవర్ లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంగా ముందుకు సాగుతుంటే కొత్తగా వస్తున్న వెంచర్ లలో మరెన్ని సౌకర్యాలుండాలి, మరి బండ్లగూడ జాగీర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా పదెకరాలలో రాళ్ళు పాతి ప్లాట్లు చేసి అమ్మకాలు సాగిస్తుంటే టౌన్ ప్లానింగ్ ఏం చేస్తుంది. స్లమ్ లే లేకుండా చూడాలని ప్రభుత్వం దృష్టి సారిస్తుంటే ఇక్కడేంటి కోట్లు పెట్టి ప్లాట్లు కొనే వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా వెంచర్ యజమానులు మోసం చేస్తుంటే అధికారులకు పట్టదా అక్రమ వెంచర్ అని తెలిసినా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలా ఇంటి నిర్మాణాలకు పర్మిషన్ లు ఇస్తున్నారు. ఈ ఇల్లీగల్ వెంచర్ లో విల్లాలు నిర్మిస్తూ కోట్లకు మార్కెట్ లో బేరం పెడుతుంటే బాధ్యత కలిగిన వహించాల్సిన అధికారులు చోద్యం చూడటమెంటి. అధికారులు డబ్బుల కక్కుర్తిని వదిలి నిక్కచ్చిగా వ్యవహరిస్తే అక్రమ వెంచర్ వేస్తారా. అధికారులు కాసుల మాయలో పడి రియాల్టర్ లతో కుమ్మక్కై అక్రమ వెంచర్ కు తెరలేపారు.

## స్పెషల్ లోక్-అదాలత్ లో 1134 కేసులలో రాజీ : ఎస్పీ పరితోష్ పంకజ్

**సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ.58.42లను తిరిగి సైబర్ బాధితులకు అందేలా రీఫండ్**

**స్పెషల్ లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులను, సిబ్బందిని అభినందించిన ఎస్పీ**



సంగారెడ్డి( ప్రశ్న న్యూస్) గత వారం రోజుల నుంచి జరిగిన స్పెషల్ లోక్-అదాలత్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై రాజీ పడటానికి అవకాశం ఉన్న, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న 366- ఐ.పి.సి, సైబర్ క్రైమ్(111), ఇ-పెట్టి (139), డిడి కేసులు(629) మొత్తం 1134 కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదర్చడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ స్పెషల్ లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులైన డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, డి4సి-డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, లైజనింగ్ అధికారి ఎస్ఐ సత్యనారాయణ, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# దర్శకత్వంపై దృష్టి సారించిన రానా..



రామానాయుడు పెద్ద మనవడు రానా మొత్తానికీ తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. రామానాయుడు తన పెద్ద కొడుకు సురేశ్ బాబు ఇద్దరు పిల్లల్లో పెద్దవాడైన రానా ను దర్శకుడిని, చిన్న వాడైన అభిరామ్ ను హీరోను చేయాలని అనుకున్నారు. ఎందుకంటే తన కొడుకులిద్దరిలో సురేశ్ నిర్మాత కాగా వెంకటేశ్ హీరో. ఇద్దరూ ఎప్పుడూ మెగా ఫోన్ పట్టాలని అనుకోలేదు. అయితే రామానాయుడుకు మాత్రం చివరి వరకూ ఒక్క సినిమా అయినా డైరెక్ట్ చేయాలనే కోరిక ఉండేది. కానీ దానిని తీర్చుకోకుండానే ఆయన కన్నుమూశారు.రానా ను డైరెక్టర్ గా చూడాలని రామానాయుడు అనుకోవడానికి కారణం లేకపోలేదు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు.తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులు కున్నాడు కూడా. ఈ నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి మాట్లాడుతూ..... వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు.

# ఇప్పటికైనా స్త్రీలను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాను

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అను ఇమాన్యుయేల్ ఒకప్పుడు కమర్షియల్ చిత్రాల్లో నటించి మెప్పించింది. అయినప్పటికీ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో కొద్ది కాలంపాటు సినిమాలకు దూరం అయింది.ఇటీవల మళ్లీ 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చింది. ఇందులో రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటించగా.. ఆమె స్నేహితురాలిలాగా అను నటించి తన నటనతో ప్రశంసలు పొందింది. లేడీ ఓరియెంటెడ్ సినిమాగా వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' చాలామంది అమ్మాయిలను ఇన్స్పైర్ చేస్తోంది. అలాగే కొందమంది మహిళలను కన్నీరు పెట్టేలా చేస్తూ..ఎలాంటి కష్టం వచ్చినా ఎదుర్కొనే ధైర్యం నింపుతోంది. అను ఇమాన్యుయేల్‌కు ఈ సినిమా కలిసొచ్చిందని చెప్పొచ్చు.

మంచి పాజిటివ్ టాక్‌తో పాటు అమ్మడు చేసిన పాత్ర అందరికీ కనెక్ట్ అవుతోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అను పలు ఆసక్తికర కామెంట్స్ చేసింది. "కొంతమంది స్త్రీలు ఇష్టంతోనే ఇంట్లో ఉండిపోయి, తమ పిల్లలను కుటుంబాలను చూసుకుంటారు..అది తప్పు కాదు!! ఉద్యోగం చేయాలి, తమకంటూ గుర్తింపు పొందాలనుకున్నప్పుడు తమ ఇష్టానికి విరుద్ధంగా ఉండిపోతేనే అది తప్పు అవుతుంది. మా సినిమాలో కూడా ఇలాంటివే చూపించాము. అమ్మాయిలకు నచ్చినట్లు ఉండొచ్చు. అంతేకానీ ఒకరు చెప్పుచేతల్లో కాదు. వారికి నచ్చిన జీవితాన్ని గడిపే వారు సమాజంలో చాలా తక్కువ మంది ఉన్నారు. ఇంట్లో వాళ్ళు, చేసుకున్న భర్తనో వారిని కంట్రోల్ చేస్తున్నారు. కానీ అది ముమ్మాటివి తప్పు. మగవారికి ఉన్నట్లే ఆడవాళ్లకు ఇష్టాలు, గోల్స్ ఉంటాయని గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతుండగా.. ఈ కామెంట్స్ గురించి తెలుసుకున్న నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.



# స్టూడెంట్స్ మోటివేషనల్ స్పీచ్ ఇచ్చిన శర్వానంద్



యంగ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం ఒక మంచి విజయం కోసమా ఎదురుచూస్తున్నాడు. శర్వా ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. డిసెంబర్ లో బైకర్ తో మెప్పించడానికి సిద్ధమైన శర్వా..సంక్రాంతికి నారీ నారీ నడుమ మురారీ సినిమాతో రానున్నాడు. ఇక బైకర్ సినిమా రిలీజ్ కు దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన శర్వా.. కాలేజ్ లను విజిట్ చేస్తూ స్టూడెంట్స్ తో మమేకమై సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాడు. తాజాగా గచ్చిబౌలిలోని రిజోనెన్స్ కాలేజ్ ఫెస్ట్ కి ముఖ్య అతిథిగా విచ్చేశాడు. శర్వా రాకతో స్టూడెంట్స్ మరింత సందడి చేశారు. ఇక ఈ ఫెస్ట్ లో బైకర్ గురించిన విశేషాలను శర్వా స్టూడెంట్స్ తో పంచుకున్నాడు. అంతేకాకుండా స్టూడెంట్స్ మోటివేషనల్ స్పీచ్ కూడా ఇచ్చాడు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా లేచి నిలబడాలని, తమ జీవితంలో నువ్వు ఏం చేయాలో.. ఏం చేయకూడదో ఎవరు చెప్పాల్సిన అవసరం లేదని.. నిన్ను నువ్వు నమ్మితే సక్సెస్ అదే వస్తుందని తెలిపాడు.' నేను కొన్ని విషయాలు మీతో పంచుకోవాలనుకుంటున్నాను. నా లైఫ్ లో నేను చాలాసార్లు పడ్డాను, ఓడిపోయాను, మోసపోయాను. కానీ, పడిన ప్రతిసారి లైఫ్ లో ఒకటి నేర్చుకున్నాను. మన కథ మనమే రాసుకోవాలి.. నువ్వేం చేయాలో.. ఏం చేయకూడదో ఒకరు చెప్పాల్సిన అవసరం లేదు. బుక్ నీది.. పెన్ను నీది.. స్టోరీ నీది.. ఇష్టం వచ్చినట్లు రాసుకోండి. ఈ మధ్యనే నేను నాలుగు విషయాలు నేర్చుకున్నాను. అవి మీకు చెప్తాను. నిన్ను నువ్వు నమ్ము... ఎప్పుడు గివ్ అప్ ఇవ్వకు.. నువ్వే నీకు హీరో.. ప్రేమతో జీవించు.. అంటూ స్టూడెంట్స్ చేత ప్రమాణం చేయించాడు. ప్రస్తుతం శర్వా స్పీచ్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# హీరోయిన్స్‌కు స్ట్రాంగ్ పాత్రలు వస్తే హీరోలకు నచ్చదు




ఆండ్రియా జర్మియా లేటెస్ట్ తమిళ డార్క్ కామెడీ థ్రిల్లర్ 'మాస్క్'. కవిన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి వికర్ణన్ అశోక్ దర్శకత్వం వహిస్తుండగా..ది షో మస్ట్ గో ఆన్, బ్లాక్ మద్రాస్ ఫిల్మ్స్ బ్యానర్స్‌పై నిర్మించనున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ఈనెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస ఇంటర్వ్యూస్‌లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆండ్రియా తను నటించిన 'వడ చెన్నై' చిత్రంపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'వడచెన్నైలో చంద్రగా నటించిన తర్వాత.. నాకు విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా అందాయి. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఈ మూవీ తర్వాత నాకు ఎలాంటి సినిమా ఆఫర్లు రాలేదు. అయితే చాలా మంది నటులు తమ సినిమాల్లో బలమైన, శక్తివంతమైన మహిళా పాత్రలు ఉండటాన్ని అసౌకర్యంగా ఫీల్ అవుతారు. అందుకే ఆ సినిమా తర్వాత నాకు వేరే ఆఫర్లు రాలేదు. ది నేను తమిళ సినిమాలో స్పష్టంగా గమనించిన విషయం' అంటూ విచారం వ్యక్తం చేసింది.

# పెళ్లికి ముందే డేటింగ్ చేయాలి

పెళ్లికి ముందు డేటింగ్ చేస్తే కట్టుకోబోయేవాడు మగాడో కాదో తెలుస్తుంది అంటుంది బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ మలైకా అరోరా. పర్సనల్ లైఫ్, రిలేషన్‌షిప్‌లపై కామెంట్స్ చేస్తూ నిత్యం వార్తల్లో నిలిచే ఈ బ్యూటీ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని వివాహంపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'పెళ్లి చేసుకునే ముందే.. కాబోయే జీవిత భాగస్వామితో డేటింగ్ చేయాలి. అప్పుడు మాత్రమే అతని అసలు స్వభావం, బాధ్యత, పురుషత్వం వంటి విషయాలు అర్థమవుతాయి. కలిసి గడిపే ఆ సమయం భవిష్యత్‌కి చాలా కీలకం. ఎందుకంటే.. ఆ వ్యక్తితో అమ్మాయికి పర్సనల్ సంతృప్తి ఉందా లేదా అనేది తెలుస్తుంది. లేదంటే పెళ్లయ్యాక ఇబ్బంది పడాల్సి వస్తుంది. రీసెంట్‌గా తనకు తెలిసిన అమ్మాయి పెళ్లి చేసుకున్న తర్వాత అబ్బాయి గే అని తెలిసి ఆమె ఇబ్బంది పడింది' అంటూ తెలపడంతో.. ప్రజెంట్ మలైకా కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.






## ధృవ్ విక్రమ్ పేరుతో

# భారీ మోసం

## జాగ్రత్తగా ఉండాలి

సోషల్ మీడియా వచ్చినప్పటి నుంచి భారీ మోసాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలా వరకు మన ప్రమేయం లేకుండా మనకు సంబంధించిన ఎన్నో విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులు సెలబ్రిటీలకు ఎక్కువగా ఎదురవుతున్నాయి. వారి ఫొటోలను ఏఐ ద్వారా ఎడిట్ చేసి నెట్టింట వైరల్ చేస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి సమస్యల్లో చిరంజీవి, తమన్నా, రష్మిక మందన్నా వంటి ఎంతోమంది స్టార్ సెలబ్రిటీలు కోర్టుకు ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తాజాగా, మరో యంగ్ హీరోకు ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది. కోలీవుడ్ స్టార్ హీరో తనయుడు ధృవ్ విక్రమ్ పేరుతో పలువురు భారీ మోసాలకు పాల్పడుతున్నారు. అలాగే అమాయకపు ప్రజల నుంచి డబ్బులు కూడా లాగేస్తున్నారు. ఈ విషయంపై ధృవ్ విక్రమ్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. "నా ప్రమేయం లేకుండా ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ క్రియేట్ చేసి నా ఫొటోలను అలాగే ఏఐ జనరేటర్ వాయిస్ ఉపయోగిస్తూ తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు. డబ్బులు వసూలు చేస్తున్నారు. మీడియా, ప్రెస్, ఫ్రెండ్స్ అలాగే అభిమానులకు విజ్ఞప్తి చేస్తున్నాను. నాకు కేవలం ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ మాత్రమే ఉంది. అది కూడా ధృవ విక్రమ్ పేరుతో ఉంటుంది. అంతేకానీ ఫేస్ బుక్, ట్విట్టర్, స్నాప్ చాట్ వంటి ఇతర ఎలాంటి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లేవు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి. ఇలాంటి మోసాల నుంచి ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాల్సిందే. అంతేకాకుండా ఏదైనా కొత్తగా సోషల్ మీడియా అకౌంట్ ఓపెన్ చేస్తే ఆ విషయాన్ని స్వయంగా నేనే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అధికారికంగా వెల్లడిస్తాను"అని అభిమానులను అలర్ట్ చేశారు.

# వంద కోట్ల డెబ్యూ..ఎక్కడికి వెళ్లిపోయాడు?



తొలి సినిమాతోనే వంద కోట్ల వసూళ్లు రాబట్టడం అన్నది ఎంత పెద్ద బ్యాగ్రౌండ్ ఉన్న హీరోకైనా చాలా పెద్ద టార్గెట్టే. 'ఉప్పెన' సినిమాతో ఈ సెన్సేషనల్ ఫీట్ సాధించాడు వైష్ణవ్ తేజ్. ఆ సినిమా సక్సెస్ క్రెడిట్లో హీరోకు మేజర్ షేర్ ఇవ్వలేం కానీ.. డెబ్యూలోనే తన పేరు మీద వంద కోట్ల సినిమా ఉండడం మాత్రం తనకు పెద్ద ప్లస్ అనడంలో సందేహం లేదు. కానీ 'ఉప్పెన'తో వచ్చిన హైప్‌ను అతను సరిగా ఉపయోగించుకోలేకపోయాడు. వైష్ణవ్ రెండో చిత్రం 'కొండపొలం' దారుణమైన ఫలితాన్నందుకుంది. మూడో చిత్రం 'రంగ రంగ వైభవంగా', నాలుగో మూవీ 'ఆదికేశవ' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి. తొలి సినిమాతో వచ్చిన పేరు, మార్కెట్ మొత్తాన్ని తర్వాతి మూడు సినిమాలు తుడిచిపెట్టేసి వైష్ణవ్‌ను నేల మీదికి తెచ్చేశాయి. దీంతో తర్వాత ఎలాంటి సినిమా చేయాలనే విషయంలో అయోమయంలో పడిపోయాడీ మెగా కుర్రాడు. 'ఆది కేశవ' రిలీజై రెండేళ్లు కావస్తోంది. ఇప్పటిదాకా తన తర్వాతి సినిమాను వైష్ణవ్ ప్రకటించలేదు. అసలు ఈ రెండేళ్లలో తన కొత్త సినిమా గురించి ఏ కబురూ వినిపించకపోవడం ఆశ్చర్యకరం. మరీ ఇంత గ్యాప్ తీసుకుంటే ప్రేక్షకులు హీరోను మరిచిపోయే అవకాశముంది. కొత్త సినిమాకు బజ్ క్రియేట్ చేయడం కూడా కష్టమే. ఈ రెండేళ్లలో ఒక్క కథను కూడా ఓకే చేసి ముందుకు తీసుకెళ్లకపోయాడంటే వైష్ణవ్ అంత జాగ్రత్త పడుతున్నాడా.. లేక తన దగ్గరికి కథలు రావడం లేదా అన్నది ప్రశ్నార్థకం. ఐతే లేటెస్ట్‌గా వినిపిస్తున్న కబురేంటంటే.. అతను విక్రమ్ కుమార్ నుంచి నరేషన్ విన్నాడట. ఈ ప్రాజెక్టును సీరియస్‌గా పరిగణిస్తున్నాడట. విక్రమ్‌కు కూడా కెరీర్లో బాగా గ్యాప్ వచ్చింది. హలో, గ్యాంగ్ లీడర్, థాంక్యూ ఫ్లాపులతో అతను వెనుకబడిపోయాడు.

## బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గా వెంకటరమణ బాధ్యతలు స్వీకరణ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయనను బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పర్యవేక్షకులు (సూపరింటెండెంట్)గా నియమించారు. శనివారం ఆయన బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భీమా జయశీల, ఎంపిఓ శ్రీధర్, సిబ్బంది పూలమొక్కను అందజేసి వెంకటరమణకు ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన వెంకటరమణకు పలువురు అభినందనలు తెలియజేశారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే నిరవధిక సమ్మె

### - మధ్యాహ్న భోజన కార్మికుల హెచ్చరిక - సీఐటీయూ డిమాండ్

సిరిసిల్ల /వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు, నిర్వహణ బిల్లులు అలాగే పది నెలల కోడిగుడ్ల బిల్లులు విడుదల కావడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారికి కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ



**- గత ఆరు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు**

జిల్లా వ్యాప్తంగా వందలాది మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఆరు నెలలుగా వేతనాలు, నిర్వహణ బిల్లులు, 10 నెలల కోడిగుడ్ల బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఎటువంటి పరిష్కారం కనిపించడంలేదని తెలిపారు. “యూక్లియర్‌లో బిల్లులు ఉన్నాయ్… మాకు సంబంధం లేదు” అంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు.

**- గుడ్ల బడ్జెట్ సరిపోకపోవడం - ఒత్తిడులు పెరుగుతున్నాయి**

ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్‌తో రెండు కోడిగుడ్లు కూడా రావడం లేదని, పైగా స్కూల్ సిబ్బంది మూడు గుడ్లు పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. “మూడు గుడ్లు పెట్టమంటే పెట్టాం… కానీ పది నెలలుగా బిల్లులు విడుదల చేయకపోతే కార్మికులు ఎలా సాగుతారు?” అని ప్రశ్నించారు.

**- గ్యాస్ పై ప్రభుత్వం, అధికారుల ద్వంద్వ వైఖరి**

మధ్యాహ్న భోజన నిర్వహణకు కట్టెల పొయ్యిలు వాడొద్దని ఆదేశాలు జారీ చేస్తూ, మరోవైపు స్టవ్ మాత్రమే ఇస్తామని, సిలిండర్లు కార్మికులే కొనుక్కోవాలని ప్రభుత్వం చెప్పడం చాలా అన్యాయమని పేర్కొన్నారు.
“గ్యాస్ మనం ఇంట్లో వాడుకోవడం లేదు… బడి పిల్లలకే వంట చేస్తాం. అయినా కార్మికులనే బాధ్యులను చేస్తున్నారు” అని విమర్శలు గుప్పించారు.

**- కొత్త మెనూ - పాత బడ్జెట్‌తో సాధ్యం కాదు**

రాష్ట్రవ్యాప్తంగా రెండు రకాల కూరలు, సాంబారు, రాగి మాల్ట్ వంటి కొత్త మెనూను ప్రవేశపెడుతూ ఒత్తిడి తెస్తున్నారని, కానీ ఈ మెనూకు కావాల్సిన అదనపు బడ్జెట్ ప్రభుత్వం కేటాయించడం లేదని అన్నారు. “కొత్త మెనూకి అదనపు బడ్జెట్, కార్మికులకు అదనపు వేతనం ఇవ్వకపోతే అమలు అసాధ్యం” అని స్పష్టం చేశారు.

**-దసరా రోజున కూడా కుటుంబానికి ఇబ్బందులు**

వేతనాలు లేక దసరా పండగ రోజున కూడా చాలా మంది కార్మికులు తమ కుటుంబాలను పోషించలేని పరిస్థితి దాపురించిందని తెలిపారు.

**- ప్రభుత్వం వెంటనే స్పందించాలి - లేనిపక్షంలో సమ్మె**

బకాయి వేతనాలు, బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. “ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే…
మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్లడానికి వెనకాడము” అని శ్రీధర్ హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మల్లారపు అరుణ్ కుమార్, కోనరావుపేట మండల అధ్యక్ష-కార్యదర్శులు గొట్టే బాలమని, పులి వసంత, వెంకట లక్ష్మి, గడ్డం పద్మ,మ్యాకల కవిత,గౌరవ్వ, లింగు రాధా,తదితర మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు

**- ఆరోగ్యం పై అవగాహన కల్పించిన వైద్య బృందం**

**- బోయినిపల్లి మండల వైద్యాధికారి: డాక్టర్ కార్తీక్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం సందర్శించింది. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. అలాగే ఓరల్ హెల్త్, చలికాలంలో ఎక్కువగా వచ్చే అస్తమా - అలెర్జీలు, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ ఆర్. కార్తీక్ మాట్లాడుతూ, “పిల్లల్లో చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యం చేయడం చాలా ముఖ్యం. పౌష్టికాహారం, పరిశుభ్రత, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లతోనే విద్యార్థినులు ఆరోగ్యంగా పెరుగుతారు. చలికాలంలో శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా వస్తాయి కనుక స్కూల్ స్టాఫ్ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి,” అని తెలిపారు. తరువాత స్కూల్ హాస్టల్‌ను పరిశీలించిన వైద్య బృందం, విద్యార్థినులకు పరిశుభ్రమైన, వేడి ఆహారం అందించాలంటూ వార్డెన్‌కు సూచనలు చేసింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు టి. హేమలత, బిల్ల అశోక్, ఇంచార్జి ఎస్.ఓ. సంగీత, సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్త ఉషాదేవి, స్కూల్ ఆరోగ్య కార్యకర్త ప్రసన్న, ఆశా కార్యకర్త సరళ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ లోక్-అదాలత్‌లో బాగంగా మెదక్ జిల్లాలో 503 కేసుల రాజీ

**జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు,**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) స్పెషల్ లోక్-అదాలత్ కార్యక్రమం లో భాగంగా, మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన రాజీ పడదగిన 503 కేసులను లోక్-అదాలత్‌లో సమర్థవంతంగా పరిష్కరించడం జరిగింది. ఇరు వర్గాలను సమన్వయం చేస్తూ, పరస్పర రాజీకి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి కేసులను పరిష్కరించుకోవడం జరిగింది. ప్రత్యేకంగా సైబర్ నేరాలకు సంబంధించిన 41 కేసుల్లో, బాధితులు కోల్పోయిన రూ. 11,44,608/- మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేయునట్లు సంబంధిత బ్యాంకుల నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, మాట్లాడుతూలోక్-అదాలత్ అనేది క్షణికావేశంలో జరిగే చిన్నపాటి వివాదాలు, గొడవలను శాంతియుతంగా పరిష్కరించుకునే అద్భుత వేదిక. కోర్టుల్లో సంవత్సరాల తరబడి నిలిచే కేసులను ఇరు వర్గాల రాజీ ద్వారా పరిష్కరించుకోవడం సమాజానికి ఎంతో మేలు చేస్తుంది. రాజీ మార్గమే రాజమార్గం అనే భావన ప్రతి ఒక్కరిలో పెరగాలని అన్నారు. జిల్లాలో లోక్-అదాలత్ విజయవంతం కావడంలో పాత్ర వహించిన పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, సైబర్ క్రైమ్ యూనిట్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## పశు వైద్యశాల ద్వారా సమర్థవంతమైన సేవలు అందించాలి.

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామంలోని పశువైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. వైద్య సేవలు, మందుల రికార్డులను పరిశీలించారు. పశు వైద్యశాలకు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. హాస్పిటల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని,ఎప్పుడు పాడి రైతులకు అందుబాటులో ఉండి పాడి పశువుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పశు వైద్య అధికారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా వొడ్యాల సందీప్ జన్మదిన వేడుకలు - శుభాకాంక్షలు - సన్మానం





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న వేములవాడ పట్టణం గాంధీనగర్‌కు చెందిన వొడ్యాల సందీప్ జన్మదిన వేడుకలు శనివారం ఆనందభరితంగా జరిగాయి. వైద్య కళాశాలలో సహచరుల మధ్య సందీప్ కేక్ కట్ చేసి పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం వేములవాడలోని తన నివాసంలో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహిత మిత్రులతో కలిసి పుట్టినరోజు వేడుకలను ఆహ్లాదకరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ అభిమానం గల స్నేహితులు ఆయనకు శాలువా కప్పి సన్మానిస్తూ, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దివ్య ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని కోరుతూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రి అజారుద్దీన్ సేవాభావం అభినందనీయం

**- యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షులు : షేక్ నిసార్ అహ్మద్**

**- మంత్రి అజారుద్దీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యునైటెడ్ టీమ్ ప్రతినిధులు**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నిసార్ అహ్మద్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ,పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్‌ను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో యునైటెడ్ టీమ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ మంత్రి అజారుద్దీన్ ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కారానికి కృషి చేసే సేవాభావ నాయకుడని అభివర్ణించారు. మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి అజారుద్దీన్, మైనారిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ టీమ్ సభ్యులు డాక్టర్ మొహమ్మద్ అఖిల్ అహ్మద్, మొహమ్మద్ హాజీ, ఇబ్రాహీం ఖాన్, షఫీక్ పాషా, పాషా టైలర్, డిజిటల్ రికార్డ్స్ సీఈఓ మొహమ్మద్ ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## రచయిత రమేశ్వరి సాయి అకుల నుండి భావనల సాహిత్యయాత్ర - ఎ థౌసండ్ వింటర్స్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజమండ్రి నగరానికి చెందిన రమేశ్వరి సాయి అకుల ప్రస్తుతం కెనడా దేశంలోని టొరాంటో నగరంలో నివసిస్తున్నారు. ఆమె రచించిన తాజా ఇంగ్లీష్ కవితా సంపుటి ఏ థౌసండ్స్ వింటర్స్ పాఠకుల మనసులను హత్తుకుంటోంది. ఈ గ్రంథంలో నూటకు పైగా ఆత్మీయమైన, ఆధ్యాత్మిక స్పర్శ కలిగిన కవితలు చోటు చేసుకున్నాయి. ప్రేమ,ఆకాంక్ష, మనసులోని నిశ్శబ్ద వేదనలను సున్నితంగా ప్రతిబింబిస్తూ ఈ కవితలు పాఠకుడిని ఒక అంతర్ముఖ యాత్రకు తీసుకెళ్తాయని కవయిత్రి తెలిపారు. ఏ థౌసండ్ వింటర్స్ కేవలం కవిత్వ సంకలనం మాత్రమే కాకుండా, మనసు లోతుల్లో ఉప్పొంగే భావాలను ఆవిష్కరించే ఒక ఆత్మానుభూతి గాధగా నిలుస్తుంది. ఈ పుస్తకం కిండిల్ లో (Amazon Kindle) మరియు Amazon.com ద్వారా భౌతిక ప్రతిగా కూడా అందుబాటులో ఉందని పాఠకులు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

## స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛభారత్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో జరిగినకార్యక్రమంలో పార్టీ నాయకులు సచివాలయ సిబ్బంది మహిళలతో కలిసి పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమీ ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్రంలో ఈ కార్యక్రమం ద్వారా మెరుగైనటువంటి సౌకర్యాల్ని ప్రజల కల్పించి వారిఆరోగ్యాన్ని మెరుగుపరిచి ముందుకు నడిపించాలని ఆలోచనతో పని చేస్తూ ఉన్నారు ముఖ్యమంత్రి అని అన్నారు వారి వారి గ్రామాలను ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం ముందుకు పోవడం శు భపరిణామం అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి తో పాటు గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్ బూత్ కమిటీ కన్వీనర్ శంకర్ రెడ్డి పార్టీ నాయకులు నారాయణ శెట్టి వెంకటేష్ ధనుంజయులు హరి సంఘమిత్రాలు సి మునెమ్మ భాస్కరమ్మ డ్వాక్రా మహిళలు ఆశా వర్కర్లు ధనమ్మ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**-ఆసక్తి గలవారు జగిత్యాల కేజీబీవీ లో**

**ఈ నెల 18 వ తేదీ లోపల అప్లై చేసుకోగలరు**





జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) జగిత్యాల లోని కండ్లపల్లి మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తుల కోసం జగిత్యాల రూరల్ మండల విద్యాధికారి ఆహ్వానించారు. దానికి సంబంధించిన అర్హతలు, వివారాలు తెలిపారు.
1) ఇంటర్మీడియట్ లో 45% 2)ఏఎన్ఎం ట్రైనింగ్ లో 45% అదనపు అర్హతలు జి ఎన్ ఎం ట్రైనింగ్ 5 మార్క్స్ బిఎస్సి నర్సింగ్ ట్రైనింగ్ 10 మార్క్స్ పై అర్హతలు ఆసక్తి గలవారు జగిత్యాల కేజీబీవీ మంగళవారం 2025 నవంబర్ 18 లోపల అప్లై చేసుకోగలరని జగిత్యాల రూరల్ మండల విద్యాధికారి పత్రిక ప్రకటనలో తెలిపారు.

# తిరుపతి వెళ్లాలంటే ఎన్ని కష్టాలో

## - సామాన్య భక్తులకు తిరుమలలో పెరుగుతున్న ఇబ్బందులు

- క్యూలైన్లో గంటల తరబడి నిరీక్షించే పరిస్థితి ఎప్పుడు తొలగెను
- వీఐపీల సేవలో టీటీడీ పాలకమండలి సామాన్య భక్తుల పరిస్థితి ఏమిటి
- రూమ్ ల కష్టాలు, సడన్ గా వస్తే ముప్పు తిప్పలే వెంకన్న భక్తుల బాధలు ఎవరికి పట్టేను
- ప్రభుత్వాలు మారిన వెంకన్న భక్తుల బాధలు మారవా.?
- ఒక గంటలో సామాన్యుని కి దర్శనం చేయించే సత్తా టీటీడీకి లేదా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీని ప్రక్షాళన చేసేనా.?
- విఐపిలు పాలకమండలికి ముఖ్యం వెంకన్నకు కాదుగా



**అమరావతి/తిరుమల(ప్రశ్న న్యూస్)** ప్రపంచ ప్రఖ్యాత హిందూ తీర్థక్షేత్రం తిరుమల, రోజూ లక్షలాది భక్తులు శ్రీ వేంకటేశ్వరుడి దర్శనం కోసం వస్తుంటారు. కానీ ఇటీవల కొన్ని నెలలుగా భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఆగ్రహం రేపుతున్నాయి. తిరుపతి వెళ్లాలంటే ఉన్న ఫలంగా 24 గంటలు దర్శనానికి నిలబడాలి అనే పరిస్థితి సాధారణమైపోయింది. దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడుతున్న భక్తులకు సౌకర్యాలు తగినంతగా లేవని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్ని గంటలు క్యూ కాంప్లెక్స్ లో ఉంచడం ఎంతవరకు సమంజసం. టీటీడీ పాలకవర్గం సామాన్య భక్తులకు రోజురోజుకు దర్శనాన్ని, గదులను దూరం చేస్తోంది. ఉన్నపలంగా దర్శనం చేసుకోవాలంటే ఆ భక్తుడికి పగటి చుక్కలు కనపడతాయి అలా మార్చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

### ఆన్లైన్ బుకింగ్స్ ం భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయా.?

భగవంతుడి దర్శనం కోసం టిటిడి అనుసరిస్తున్న ఆన్లైన్ టికెట్ వ్యవస్థ భక్తులకు వరమా.? శాపమా.? అనే ప్రశ్న తలెత్తుతోంది. విడుదల చేసే క్షణాల్లో వేలాది టికెట్లు సెకన్లలోనే సోల్డ్ ఔట్ కావడం, ట్రావెల్ ఏజెంట్ల దందా, మధ్యవర్తుల ఆధిపత్యం వంటి ఆరోపణలు పెరుగుతున్నాయి. ఇంత జరుగుతున్న టిటిడి పాలకమండలి మాత్రం తన విధానాలను మార్చుకోక భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది.

### భక్తులు చెప్పే మాటలు..

- "ప్రతి నెలా టికెట్లు తెరిచిన 10 సెకన్లకు పోతున్నాయి. ఇది ఎలా సాధ్యం.? కంప్యూటర్లు కూడా అంత వేగంగా పనిచేయవు"
- "ఆన్లైన్లో బుక్ అవ్వట్లేదు, వెళ్లి నిలబడితే 18-24 గంటలు క్యూలో ఉండాలి"

ఇలాంటి వెయ్యిలాది ఫిర్యాదులు ప్రతిదినం వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడం బాధాకరం.

### తిరుమలలో వసతి గృహాల అరుదు - దొరికితే ధరలు భగ్గుమంటున్నాయి..

- దేవుడిని దర్శించుకోవడానికి వచ్చాక ఉండటానికి గదులు దొరకడం అత్యంత కష్టతరమైంది.
- టిటిడీ గదులన్నీ ఆన్లైన్లో సెకన్లలో పోతున్నాయి.
- ముందు వచ్చిన వారికి మొదట సేవ అనే సూత్రం అడుగంటింది.
- భక్తులు వందల కిలోమీటర్లు ప్రయాణించి తిరుపతికి చేరుకున్నాక గదులకు అవస్థలు పడటం వారిని మరింత నిరాశపరుస్తోంది.

### భక్తుల కన్నా వీఐపీలకే ప్రాధాన్యత.?

- టిటిడి మీద మరో పెద్ద విమర్శ ం వీఐపీ దరఖాస్తులను పక్కకు పెట్టే ధైర్యం ఎవరికీ లేదు.
- ప్రతిరోజూ వేలాది వీఐపీ రిఫరల్స్ జారీ అవుతుండటంతో సామాన్యులకు దర్శనం దూరమవుతోందన్నది వాస్తవం.
- విఐపి పాసులలో అనేక అవకతవకలు జరగడంతో పాటు కొంతమంది వీఐపీలు పాసులు అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- "వెంకన్న సాధారణ భక్తులకు దూరమవుతున్నాడు" అనే భావన దేశ వ్యాప్తంగా వ్యాపిస్తోంది.

### తిరుమల భక్తి కేంద్రమా.? లేక ప్రభుత్వ ఆదాయ కేంద్రమా.?

వైఎస్సార్‌సీపీ పాలనలోనూ, ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలోనూ కామన్ ఫిర్యాదు ఇదే -

"పాలకుల కంటపడేది భక్తుల భక్తి కాదు.. వారి జేబులో నుంచి వచ్చే డబ్బే" దర్శన టారిఫ్‌లు పెంపుతో

- ప్రత్యేక దర్శన టికెట్ల ఆధారంగా వచ్చిన భారీ ఆదాయం
- లడ్డూ రేట్లు, మరెన్నో సేవల ధరల పెంపు
- దీంతో తిరుమల భక్తికే ప్రాణం - కానీ ప్రభుత్వం వ్యాపారంలా చూస్తోంది అనే విమర్శలు పెరుగుతున్నాయి.

### టిటిడీపై పూర్తి స్థాయి ప్రక్షాళన అవసరం..



### ప్రజలు కోరుకుంటున్న దిద్దుబాట్లు..

- దర్శనం వేచి ఉండే సమయాన్ని గరిష్టంగా 2 గంటలలోపు పరిమితం చేయాలి.
- ఆన్లైన్ టికెట్ సిస్టమ్‌ను పారదర్శకంగా మార్చాలి.
- విఐపి దర్శనాలు పూర్తిగా రద్దు చేసి ప్రతి భక్తుడికి విఐపి తరహా దర్శనం అందించాలి
- గదుల కేటాయింపుపై బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా నిర్మూలించాలి
- లడ్డూ, ప్రసాదాల తయారీ, పంపిణీలో అవినీతిని అరికట్టాలి.
- ప్రభుత్వ జోక్యం తగ్గించి, టిటిడి స్వతంత్రంగా పనిచేసే విధానాన్ని బలోపేతం చేయాలి.

### ఆన్లైన్ దందాను అరికట్టగలరా.?

- లైన్లలో వేలాది భక్తులు పడుతున్న వేధింపులను తగ్గించగలరా.?
- భక్తుల నమ్మకం తిరిగి పొందాలంటే టిటిడీపై పూర్తి స్థాయి ప్రక్షాళన తప్పనిసరి.
- సడన్ గా వచ్చే భక్తులకు దర్శనం గదులు అందించగలరా.?

### గంటలో దర్శనం కల్పిస్తారా... సీఎం చంద్రబాబు సార్.?

**- తెలంగాణ, ఆంధ్ర, దేశం మొత్తం నుండి వస్తున్న కోటానుకోట్లు భక్తులు ఒకటే అడుగుతున్నారు.**

"ఒక గంటలో దర్శనం చేసుకునే రోజులు తిరిగి వస్తాయా.?" ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి ఎదురైన కీలక పరీక్ష ఇదే, వీఐపీ దరఖాస్తులను నియంత్రించే ధైర్యం ఉందా.?

### పాలకులు ఇది మర్చిపోయారు..

శ్రీ వేంకటేశ్వరుడి దర్శనం ం నమ్మకమూ, నిత్యానందమూ. అది మరల భక్తులందరికీ సులభమవ్వాలంటే పాలకులు కఠిన చర్యలు తీసుకోవాలి.

లాభాలు కాదు, భక్తి ప్రధానమవ్వాలి.

## నవీన్ యాదవ్‌ను వారికి పరిచయం చేశాను

### - రేవంత్ రెడ్డి ట్వీట్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన నవీన్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి పరిచయం చేసినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. నవీన్ యాదవ్‌తో పాటు పలువురు నేతలతో కలిసి రాహుల్ గాంధీని కలిశారు. అనంతరం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని ట్వీట్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఢిల్లీలో రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన పేర్కొన్నారు. నవీన్ యాదవ్‌ను రాహుల్ గాంధీ వద్దకు తీసుకువెళ్లినట్లు తెలిపారు. రాహుల్ గాంధీని కలిసిన అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా కలిసినట్లు రేవంత్ రెడ్డి మరో ట్వీట్‌లో వెల్లడించారు. ఖర్గేను, రాహుల్ గాంధీని కలిసిన సమయంలో నవీన్ యాదవ్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, ఖర్గేలు ఉప ఎన్నికలో విజయం సాధించిన నవీన్ యాదవ్‌ను అభినందించారు.

## తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు

# విన్ గ్రూప్ ఆసక్తి

### - ఢిల్లీలో రేవంత్ రెడ్డితో విన్ గ్రూప్ ఆసియా సీఈవో భేటీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో విన్ గ్రూప్ ఆసియా సీఈవో సమావేశమయ్యారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉండగా, దేశ రాజధానిలో ముఖ్యమంత్రితో సీఈవో భేటీ అయ్యారు. తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి విన్ గ్రూప్ ఆసక్తి కనబరిచింది. ఈవీలు, బ్యాటరీ స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు విన్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని ఆహ్వానించారు. ఇదిలా ఉండగా, అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు.

# ఇలా సీజ్ చేశారు.. అక్రమ నిర్మాణదారుడు అలా తొలగించాడు

- ఉప్పల్ సర్కిల్ పరిధిలో అధికారుల కంటే నాయకులకే అక్రమ నిర్మాణాలపై మోజు
- సీజింగ్ చేసిన కాసేపటికే సీజింగ్ బోర్డును తొలగించిన వైనం
- ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ కమర్షియల్ నిర్మాణాలు
- రాజకీయ నాయకుల కనుసైగల్లో ఉప్పల్ సర్కిల్లో అక్రమ నిర్మాణాల జోరు
- టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిపై చర్య తీసుకుంటే రాజకీయ నాయకుల వత్తిళ్లు
- ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకుల మాటలు వినాలా.?
- ఉప్పల్ సర్కిల్లో అవినీతి అక్రమాలను పెంచి పోషిస్తున్న రాజకీయ నాయకులు
- ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాల పై ఉక్కు పాదం

హైదరాబాద్( ప్రశ్న న్యూస్) ఉప్పల్ సర్కిల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోప్పుతున్నారని, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే వాటిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్న స్థానిక కార్పొరేటర్లు అధికార విపక్ష నాయకులు చోటా బడా నాయకులు టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్రమాలపై చర్యలు తీసుకోదని హుకుం జారీ చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు చేపడతామని ఉప్పల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణమూర్తి తెలిపారు.

ఇంటి నెంబర్ 3-5-84 ఇందిరానగర్, రామంతపూర్ ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని, రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని, రెండు అంతస్తులకు అనుమతి తీసుకొని అక్రమంగా ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారు. స్థానికులు నుండి ఉప్పల్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు అందడంతో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని నోటీసులు జారీ చేసిన అక్రమ నిర్మాణదారుడు వాటిని లెక్కచేయకుండా నిర్మాణం చేపట్టడంతో శనివారం రోజు డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఉప్పల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ తన సిబ్బందితో అక్రమ కమర్షియల్ నిర్మాణం చేపట్టిన వాటిని సీజ్ చేయడం జరిగింది. సీజ్ చేసిన కాసేపటికి ఉప్పల్ మున్సిపల్ అధికారులు పెట్టిన సీజ్ బోర్డును అక్రమ నిర్మాణదారుడు తొలగించారని ప్రభుత్వ అధికారులు పెట్టిన సీజింగ్ బోర్డును తొలగించడంతో ఆగ్రహానికి గురైన స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.



ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
23 May 2024 - Page 8

## కార్పొరేటర్ ఇంటిముందే

# 5 అంతస్తుల అక్రమ నిర్మాణం

### జిహెచ్ఎంసి ఆదాయానికి గండి

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న అధికారులు వాటిపై చర్యలు తీసుకోకుండా రాజకీయ నాయకులు టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని ప్రభుత్వాదానికి భారీగా గండి కొడుతూ ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న



టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్న స్థానిక అక్రమాలను ప్రోత్సహించే రాజకీయ నాయకులు పలుకుబడితో టోల్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకుండా వెనకాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాదులో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే అధికారులు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు టౌన్ ప్లానింగ్ అధికారులపై అనేక ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టారని కొంతమంది రాజకీయ నాయకులు అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటుంటే జీర్ణించుకోలేకపోతున్నారని ప్రభుత్వానికి గండి కొడుతున్న రాజకీయ నాయకుల జేబుల్లో అక్రమ నిర్మాణాల అక్రమ సంపాదనకు గండి పడుతుందని టౌన్ ప్లానింగ్ అధికారులపై ఇష్టం వచ్చిన రీతిగా మాట్లాడుతూ రేంకలు వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ముఖ్యమంత్రి ఆదేశాలకు విలువ లేదా.?

ఉప్పల్ సర్కిల్లో సాక్షాత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలకు కూడా అడ్డుకట్టబడుతోంది అది కూడా రాజకీయ నాయకుల వల్లనే అన్న



ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రేటర్ హైదరాబాదులో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపిన టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమాలపై చర్యలు తీసుకోకుండా స్థానిక రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ అధికారులు తమ పనిని తాము చేసుకుంటూ పోతుంటే కొంతమంది రాజకీయ నాయకులు పనికిమాలిన వేషాలతో జోక్యం చేసుకోవడం జరుగుతోందని అలాంటి వారిపై ముఖ్యమంత్రి ఎలాంటి చర్యలు తీసుకుంటారో.?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన నిర్మాణాలను, కమర్షియల్ నిర్మాణాలను బోర్డు పెట్టిన తర్వాత ఆ బోర్డును తొలగించి నిర్మాణాలు చేపడుతున్నారని అలాంటి వారిపై అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేస్తున్నారు.

ఉప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మరి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. సామాన్యుడు ప్రభుత్వ అనుమతులు విరుద్ధంగా నిర్మాణం చేపడితే హడావిడి చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు రాజకీయ నాయకులకు వత్తాసు ఎందుకు పలుకుతున్నారో టౌన్ ప్లానింగ్ అధికారులకే తెలియాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రేటర్ హైదరాబాదులో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టిన వాటిపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588